

# నడిమింటి బోడెక్క బసివిరాలయ్యేద

నాగప్పగారి సుందర్‌రాజు

ఇ పొద్దు బడి తప్పొయ్యేదని సానా సొంతోసుము పడుతుండాను. నిన్న సంకరప్ప అయివారు సెప్పిన సక్రొడ్డి ల్యక్కులు సెయ్యిలేదు. కర్నుము అయివారికి ఇదే సొందు. నన్ని తొన్నేకి. యట్లరా దేవుడా! గుండుము గడిసేదని అపలాసన సేసుకంట వుంటే నడిమింటి పెద్దమ్మొచ్చి కార్యములోక పిలిసేద.

మా యమ్మయేమో, "వొవరే! బడికి పోదు రా," అని సెప్ప్య.

"వొప్లే సరసక్కా... నీకింతు గూడ బుద్ధి లేదు సూడుప్లే. నీవేమన్నా అనుకో ఇంట్లో కార్యము పెట్టుకొని ఈ పొద్దన్న ఇంత పొద్దుగాలుగ వొచ్చి ఆ పనీ ఈ పనీ సూసుకోకుపోతే యట్లప్లే. వొక్కొడుకు కొడుక్కాదు వొగు బిడ్డ బిడ్డగాదు అనేర. నాకి సేసే వొళ్లు యెవురుండారు నువ్వే సెప్పు. ఈ పొద్దన్న నువ్వింత ఆ పిల్ల దెగ్గరుండి పూజార్లు అడిగినివి అందిస్తే బాగులేదా. అది అసులే తిక్క పిల్లట్లాది. బసివిరాలుని ఇడిస్తాము అనిన పొద్దుట్నుంచి వొగిటే యేడుపు యేడుస్తుండాది. యంత సెప్పినా వూరుకోదు. నన్ని బసివురాలు ఇడద్దండో... యెవుడుకన్న కూలి సేసుకొని తినేవోనికి ఇచ్చి పెండ్లి సెయ్యండి. రెక్కులు కష్టిము సేసుకొని బతుకుతామని వొగిటే తరాగా యేడుస్తుండాది. మాకేమొ... వుండేది వొగితే కదా యాడన్నా బసివిరాల్ని ఇడుసుకుంటే కొండ్లు ముందు వుంటాదని ఆస. నీడ పాట్న సుకంగ వుంటాది. ముసులు ముప్పతనానికి మమ్ముల్ని మడసనంగా సూసుకుంటాదని మా ఆపలాసన," అంటాని వొగిటే యాతర సేసుకుంట మా యమ్మకి సుపుతుండాది నడిమింటి బెలిగింటి పెద్దమ్మ.

"పదక్కే... వొస్తాను పదా. పొయ్యి మింద బూవుడుకుతాది గెంజి వొంచి వొస్తాను పదా," అనె మాయమ్మ.

"ఏం ప్లే... ఇంట్లో కార్యము పెట్టుకుని బూ వొండుకుంట కుసునేవ్వా. సానా యక్కడ దప్పిందానువు వున్నట్లుండావే," అనిడిస నడిమింటి పెద్దమ్మ.

"పిల్లోల్లుండే పని గదిక్కే. కార్యమన్నంక యాలా తప్పుతాది కదా. పిల్లోల్లుకి ఆకిలయినప్పుడు ఇంట్లో వుంటే యేసుకొని తింటారు. ల్యాకపోతే పనిసేయినీ కుండ గుద్దెనుక యేడుసుకుంట తిరుగుతారు," అంటాని మా యమ్మ పడసాల కట్టమింద నుంచి పొయ్యిగడ్డ తాకిపాయ.

"వొప్పో... సాత్రాప్పో. యల్లల్లు బీలు యల్ల సదివేవగాని. ఈ పొద్దు వొగిటి బడికి పోకుంటే ఆడేమి దేసుము కుంటుపడేది లేదు. బోడెక్కని బసివురాలు ఇడుస్తుండాము కదా. సుట్టాలంతా వొచ్చేర. వాల్లికి యేమన్న నీళ్లు గీళ్లు అందిచ్చుకంట వుండుకుండ బడికి పోతానని పలకా బుక్కులు తీసుకునేవునే," అంటాని బెలిగింటి పెద్దమ్మ మా ఇంట్లో నుంచి బయటికి పొయ్యిడిస.

గాలి కాలుము. బయట ఈదురుగాలి ఈస్తుండాది. గవాసులెంట గాలి లోపులికి వొస్తుంటే పొగ బయటికి పొయ్యేకి ల్యాక ఇంటినిండ ముసురుకునేద. పొగదెబ్బికి కండ్లు మండుతుండాయి. కండ్లో నుంచి ముక్కులో నుంచి నీళ్లు కారుతుంటే మాయమ్మ వొగు సేత్తో సీమిడి సీది పొయ్యిలో యేసి కొంగుతో సమట తూడుసుకుంట గంజి వొంచుతుండాది. ఇదే సొందురా

నాయినా బడి తప్పిచ్చుకునేకని సేతిలో పలకా బుక్కాలు గూట్లో సప్పిడి కాకుండ పెట్టిడిసి మెల్లిగ బయటికి జారుకునేన.

పెండ్లికి యేసినట్లు పందిరి యేసిడిసేర. బోడెక్కోళ్లు ఇంటికాన్నుంచి మాదిగ్గేరి నిండ యేసిడిసేర. కల్డెన్నోళ్లు ఇంటి కాన్నుంచి మా ఇంటి వరుకు వాగిటే పందిరి యేసిడిసేర. బుంగులు నాటి తడుకులు యేసి బసిరాకుతో పందిరి యేసింటే గేరంతా యంత బాగుం డాదని. పందిరి కింద కుంద్రంగన్నోళ్లు ఇల్లు, పులిగెమ్మ వ్వోళ్లు ఇల్లు, కల్డెన్నోళ్లు ఇల్లు, గుంతుకంటి ఆయ మ్మోళ్లు ఇల్లు, మా పెద్దిల్లు, మా సిన్నిల్లు, నట్టనడుమ బోడెక్కోళ్లు ఇల్లు యంత కళకళలాడుతాదని.

బోడెక్కోళ్లు ఇంటి ముందు నాలుగు బసిరికట్లు నాలుగు దిక్కులు తుక్క నాటి ఆటికి జమ్మాకు కట్టేర. యరుమొన్ను సున్నుము పట్లు పెట్టేర. మద్దిలో కుంకుము బుక్కు పిండితో బొట్లు పెట్టేర. నాలుగు గుంజులు నడిమద్దిలో కమ్మిడి పొరిసి సాసుకుము యేసేర. ముందురు పక్క రెండు దిక్కులు రెండు రాసులు జొండ్లు పోసి మూడు ఆకులు రెండు వక్కులు పెట్టేర. వాగపక్కి కలుసుము పెట్టేర. కలుసుము మద్దిలో ఆకులు పెట్టిన గిన్నిలో ఈబీతి పొండు తీసుకుని కల్డెన్న కొడుకు మల్లన్న మామ అందరికి అడ్డుబొట్లు పెడుతుండాడు. బోడెక్కోళ్లు వలన్న వులిగెన్న, మల్లన్న మామ పణమింద పెట్టిన ఈబీతి పొండు అడ్డుబొట్లు మింద మద్దిలో కుంకుము బొట్లు పెడుతుండాడు. ఇంతులోకి తలారి నాగన్న మల్లన్న మామని ఆరిసిడిస.

“వొసస్... మల్లగా... పిల్లొల్లుకి ఆడొళ్లుకి రెండు రెండు బొట్లు పెట్టు. మొగొళ్లుకి మూడు మూడు బొట్లు పెట్టు. శ్యాస్త్రుము తప్పకూడదు. తెలిసేద్నా. అదేమరి. మరిసిపోకుండ సెయ్యి. లేదంటే నాకిట్లీ,” అనిడిస.

“ఓ తలారాతినీ... నాకి తెలుసులా సామీ. అవుతులు గేర్లో వుసెనక్కని బసివిరాలుని ఇడిసినపుడు నేను కార్యుము సేసేది సూస్తిని. అనమక్కని బసివి రాలుని ఇడిసినపుడు నేను దెగ్గిరుండి సూస్తిని. పులి గెమ్మవ్వని బసివిరాలు ఇడిసినపుడు కూడ సేసేన కాని సరింగ గురుతులేదు. అపుడు నాను సిన్నిపిల్లోన్ని. ఇదే మన్న పెద్ద ఇసిత్రుమా. నాకి ఇడిసిపెట్టండి మరి. ఈ పొద్దు బోడెక్కని బసివిరాలు ఇడిసే పనంతా నేనే సేస్తాను. యేమనుకునేర మడి నన్ని. మిమ్ముల్ని వొగిటి గూడ అడిగితే అపుడు అనండి. అవుర్రా మల్లగాడు పెద్ద ముసులోని లక్క యంత బాగ సేసేడ కార్యుము అనల్ల...” అనిడిస మల్లన్న మామ.

“యే మండమ్మా... ఇంగా అయ్యేద్నా లేదా. యాలా తప్పతాది. పిల్లని తీసుకురాండమ్మా. కర్నుము సామి సెప్పిన మూర్తానికి కరెట్టుగా ద్యావుర్లు గట్టల్ల. రాండి రాండి. ఇంగా యేటికి పొయ్యి సానుము సేస్కోని రావల్ల. ఇంగా యాడ పొద్దు వుండాదని అట్లా తాసికారుము సేస్తూండా,”రని లాలప్ప తాత కూతే సిడిస.

“జుమ్ చుక్నక్ - జుమ్ జుమ్ చుక్నక్- జుమ్ జుమ్ చుక్నక్,” అంటాని బ్యల్డాని బైనే ఆయప్ప జమిడికి అనిపిచ్చేతలకాల అందరి సెవులు నిగిరి బొడిసిడిసేవ.

“ఇంగేమి సూస్తారు తీసుకొండలేయ్. ఇంగా యంతోసేపని కాస్తారు ఆ తప్పిట్లుని,” అని కందారప్ప పెద్దప్ప అనేతలకాల- “జగ్గణకణకణ, జగ్గణ కణకణ, జగ్గణకాన్- జగ్గణ కణకణ, జగ్గణ కణకణ, జగ్గణకాన్,” అంటాని తప్పిట్లు, తాసాలు వర్రర్రాని మోగుతుం డాయి.

యక్కక్కట్నుంచో వొచ్చిన బసివురాళ్లంతా ముందు గుంపుగా నిలబడి పాట్లు పాడుతుండారు. మద్దిలో వొగ పెద్ద బసివిరాలు వొడి నిండ గింజులు పోసుకుని రెండు సేతుల్లో రెండు యాపమండ్లు పట్టుకోని యెంటుకులు ఇరుబోసుకుని ముకుము నిండ బండారు బూసుకోని పణిమింద కుంకుము బొట్టు పెద్దిది పెట్టుకుని, కండ్లు మూసుకోని మెల్లిమెల్లిగ నడుస్తుండాది. ఇంగా పులిగెమ్మవ్వ పెయ్యిలోకి వొచ్చినట్లు లేదు. అంద్కనేమొ ఆయమ్మ యేమేమి వూగుకోకుండ మట్టసనంగా కదులుతుండ నొడుస్తుండాది.

మొగోళ్లంతా తపిట్లు సుట్టూర సేరేర. తప్పి ట్లోళ్లు యెగిరెగిరి కొడుతుండారు. బైనే ఆయప్ప జమిడికి సుట్టు బసివురాళ్లు ముసురుకునేర. జమిడికి శబుదుము, తప్పిట్లు తాసేలు అన్ని కలిపి వొగిటే రొవుసుమింద వాగుతుంటే సుట్టుముట్టు వూర్లుకి ఇనిపిచ్చేతట్లుండాది.

యనకాల బోడెక్క యేడుసుకుంటా ముసుగేసు కోని తలకాయి వొంచుకోని మెల్లిమెల్లిగ నడుస్తుంటే ఆయమ్మ సుట్టు అవుతులు గేర్లో ఆడొళ్లు ఇవుతులు గేర్లో ఆడొళ్లు, వూర్లు నుంచి వొచ్చిన సుట్టాలు సానా మందికి ముగుబడిడిసింటే తిర్నాలునాడు తేరు సుట్టూరుగ వూరంతమంది కదిలి పొయ్యినట్లుండాది.

సిన్నసిన్న పిల్లకాయలంతా క్యాకులేసుకుంట యెగురుకంట ముందు ముందు పారిపోతుండారు.

జాతర యల్లబారినట్లు మాదిగ్గేర్లో నుంచి వూరే గింపు బయలుదేరిడిస. సవురమ్మ గుడి తాకి వొచ్చి, వొగకాయి కొట్టుకొని గోందిరొడ్డొళ్లు ఇంటి ముందెళ్లి ఈడిగి రంగయ్యొళ్లు ఇంటికాట్నించి సింతమాకుల్లోని బాయితాకి వొచ్చేతలకాల రెండుగంట్లుసేపు అయ్యిం టాది.

వక్కుపొడి కొరికేతలకాల పారిపొయ్యి పారొచ్చేంత దూరుము లేదు ఇది. అట్లా దానికి ఇదింత వూరే గింపు వొచ్చేదానికి రెండు గంటల టెయిము బట్టేద్నంటే ఇంగ సూస్కో జనుము యెంత యెగురుడుము యంత కుసీసేస్కుంట వొచ్చేర్నో.

ఇంగ తప్పిట్లు ఆపండప్పా. తప్పిట్లు ఆపి తావే వొళ్లు యెవురో బిరీన కొల్లా సరాయి తాగండి. బీడీలు గీడీలు తాగి తప్పిట్లు కాపుకోని రెడీగుండల్ల సూడీ. తాసి కార్యుము సెయ్యికుండ పిలిసేతలకాల యెత్తుకోవళ్ల-అంటాని సెప్పి దుబ్బీరన్న బాయిగడ్డతాకి పాయ.

తప్పిట్లు కొట్టేవొళ్లు తప్పిట్లు యండికి పెట్టి ఈడిగి రంగయ్యొళ్లు ఇంటి ముందు దుమ్ములోనే కుసిని డిసిరి. ఈడిగి రంగయ్యొళ్లు కుసునేర. దుమ్ములో కుసునేకి ఇస్టుము లేనొళ్లు నిలబడుకొనే వుండారు.

బాయిగడ్డ మింద ఆడొళ్లు గుంపులు గుంపులు నిలబడేర. మొగొళ్లంతా అట్లా దూరుము నిలబడేర. అది సూసేకి అగాదుము లోతుబాయి. నాకి బుద్ధి వొచ్చి నప్పట్నించి ఆ బాయిలో సుక్కు నీళ్లు వూరింది లేదు. వాండ్లు కాలుము పడినీళ్లు మూడు దినాలకి, రెట్లు గాలే పెంచుమిందికేసిన నీళ్లులక్క పీరుసుకుపోతాయి. యండ కాలుము అయితే ఆవుర్లావుర్లు వొస్తాయి బాయిలో నుంచి. ఇంత నీళ్లుకి కరువు వుండే వూరు ఈ దేసుములో యా వూరు వుండుదేమో.

మాదిగ్గేర్లో యే కార్యుము అయినా గంగకంటాని పొయ్యిరావల్లని సెంబు నిండో కడువు నిండో నీళ్లు తీసుకొనొచ్చి, వొట్టి బాయిలోకి దిగి బొట్లు బెట్టిన రాయి మిందే తెచ్చిన నీళ్లు గుమ్మురిచ్చి శ్యాస్త్రుము అయ్యి పొయ్యిడిసేదని అనిపిస్తారు.

ఇపొద్దు బోడెక్కని బసివిరాల్ని ఇడిసే కార్యుము అంటే సానా పెద్ద కార్యుము. సుట్టుముట్టు పండెం డూర్లు మంది సూసేకొచ్చేర. దూరాబారుము నుంచి సుట్టాలు గిట్టాలు వొచ్చింటే వూరంతుటికి పండు గున్నట్లు వుండాది. కల్లేగొట్టు పూజార్లు, గట్టు మల్లయ్య, గొరువయ్యిలు, వులిగి పెద్దమ్మ, ఇంగా రానేరాలేదు. వాళ్లందరికి బొస్సు అబ్బినట్లు లేదు. వొస్తారు వొస్తార్లే ద్యావుర్లు కట్టేతలకాల అనుకొంటుండారు.

బాయిగడ్డ పెయ్యి మెటికిలు మింద మ్యాకు పోతుమ్యడికి యాపాకు మండ్లు కట్టి కుంకుము బుక్కు పిండి పెట్టి దాన్ని దువ్వుతుండారు పెద్ద మనసులు.

బంగారప్పొళ్లు ఇంటి ముందుర బసిరి మాను కాడ అయిదేండ్లు నుంచి వులిగెమ్మవ్వకి ఇడిసిన బోడెక్కొళ్లు దున్నుపోతుని కట్టేసి పెట్టేర.

అయిదేండ్లు కింద ఇన్నూర్రూపాయిలికి పెద రొడ్డొళ్లు యనుగొడ్డుకి పుట్టిన దున్నుపోతు పిల్లని బోడెక్కొళ్లు నాయిన నడిమింటి కందారప్ప కొని వులిగెమ్మ కని ఇడిసిడిసేద. అది సముచ్చురము తలకాల నేమి కంటొళ్లు ద్యావురుపోతని సుట్టుముట్టు వూర్లొళ్లు అందరికి తెలిసేతట్ల తిరిగి మేసి బలిసిడిసేద. వున్న ట్లుండి వొగు సొమ్ముచ్చురము కనబడుకుండ పొయ్యి డిసేద. బోడెక్కొళ్లు తిరగని వూర్లేకుండ తిరిగితే, అక్కడ యక్కడో పడుముటుదిక్కు కనుడు దేసుములో వుండా దని తెలిసి మాదిగొళ్లుందురు ఇంటికో మనిషి పొయ్యి అదిలిచ్చుకొచ్చేర. అయిదేండ్లు అయ్యేతలకాల దాన్ని సూసేకి బయిమయ్యేతట్ల వుండాది. బోడెక్కని యప్పుడు బసివిరాల్ని ఇడుస్తారో ఈ దున్నుపోతు బాధ యప్పుడు తప్పుతాదో అంటాని రెయితులు అపలాసన సేసుకుంట వుండ్రి.

వొగునాడు బోడెక్కొళ్లు నాయిన్ని బజార్లోకి పిలిసుకొని వూర్లో వొళ్లంతా పంచాదపెట్టిడిసేర.

''ఏం కందారప్పా! ద్యవురుపోతు వూరందురు సెండ్లో పడి పయిర్లు పాడు సేస్తుండాదని వూర్లో రెయితులందురు బాదపడుతాండారు. మడి నువ్వు ఏమంటావో సెప్పు,'' అంటాని కాలుమింద కాలేసు కుని యడుము సేత్తో మీసుము దువ్వుకుంట పెదరెడ్డి అడిగిడిస.

రేడీ రూము ముందు పందులు పార్లాడే దుమ్మలో మాకాళ్లు మద్దిలోకి మాసేతులు పెట్టుకుని కుసినిన నడిమింటి కందారప్ప, నెత్తిమింద రుమాలు తీసి సంకులో పెట్టుకొని రెండు సేతులు యెత్తి మొక్కి మాట్లాడేది మొదులు పెట్టిడిస.

''నిజమే రొడ్డీ! పయిర్లు కాపుకొచ్చిన మాట నిజమే. నా ద్యావురుపోతు యాటకొచ్చిన మాట నిజమే. రవుసు మింద వున్నింది రైయ్యిమని పొయ్యి పయిర్లు మింద పడి మేసింది నిజమే. మడి నొన్నొమి సెయ్యి

మంటావు రొడ్డీ. వూరు కట్టిడి పకారుము మా కులా చారుము పకారుము, మా యింటి దేవితి వులిగెమ్మ మొక్కిబడి పకారుము సొతనయిన పనిసేస్తిని. అప్పుడు సెయ్యి తిరుగుతుండా రెండు నూర్లు పెట్టి నీ మాట పకారుము నీ యెనుగొడ్డుకి పుట్టిన దున్నపోతునే కొని ద్యావరుకి ఇడిస్తిని. ఇప్పుడు కార్యుము సెయ్యల్లంటే సిన్న పనా. మా యట్లా సన్నాళ్లకి అయ్యే పని కాదు. పసిపిల్లిని పట్టుకుని బసివిరాలిని ఇడసల్లంటే మొనుసు యెగుదుసూడి రొడ్డీ,'' అంటాని నడిమింటి కందారప్ప అంటాండగానే...

''యేమలే కందరగా... యేమంటివి. నీ బిడ్డ పసి పిల్లా. నోట్లో యేలు బెడితే కొరుకుదేమతినీ. యద మింద కొంగు తీసేస్తే సారుట్లావు వుండావి సాండ్లు. వూర్లో మొగోళ్లంత ఆ మాదిగి బోడెక్కిని యప్పుడు బసివిరాల్ని ఇడుస్తారా, యప్పుడు బొట్టు కట్టి పెట్టు కుందామని యెదురుసూస్తుంటే, యేమి వగులు మింద మాట్లాడుతుండావు మాదిగతినీ... దానికేల్యా అంటారు పెద్దాళ్లు మాలోన్ని సెప్పకుండ తన్నల్ల- మాది గోన్ని సెప్పి తన్నల్లని.'' సానా రవుసు మింద మాట్లా డిడిస బాయిగడ్డు అనుమంతు.

పెద్దిరెడ్డి అతిని మాట్లుకి అడ్డుము తగిలి, ''నువ్వుండప్పా అనుమంతూ. నేనుండాను గదా, మాట్లా డేకి... ఏం కందారప్పా ఇప్పుడు సెయ్యి. నీ బిడ్డికి వొయి సెంత.''

''పదేండ్లు రొడ్డీ!''

''అవ్వు౹్రా మొగోడా! నీ బిడ్డికి పదేండ్లని నువ్వు సెప్పితే నమ్మేకి మేమేమన్నా తిక్కనా కొడుకులు అనుకునేవునా. ఆ పిల్లని సూస్తే పదయిదేండ్లన్నా దాటుంటాయనిపిస్తాది. ఆ పిల్లికి పెండ్లి సేసింటే ఈ పాటికి నలుగురు పిల్లులన్న పుడుతుం౹్డి. అయినా పదేండ్లు అయితేనేమతినీ. పొయ్యేనేడు నాను వులిగి జాతికి పొయ్యింట్ని. ఆడ సూస్తే నాకే అచ్చర్యుము యేసేద. సిమింత సిమింత పసిపిల్లుల్ని బసివురాళ్లని ఇడుస్తుండారు. మీరు నిజుము సెప్పితే ఇంటారు. అపద్దుము సెప్పితే ఇంటారు. మాయమ్మ తోడు సెప్ప తుండాను... వొగూరొళ్లు సంకలో పిల్లనే బసివిరాళ్లు నిడిసిడిసిరి. మగా అంటే మూడేండ్లు వుండునప్పా. దీనికేమంటారు సెప్పండప్పా,'' అంటాని బాయిగడ్డ అనుమంతు లా పాయింటు తీసి కట్టమింద కుసినిన పెద్ద మనుసులు, వూర్లో వొళ్లని కట్టకింద దుమ్ములో కుసినిన మాలొళ్లు మాదిగొళ్లు అందరిని నిక్కినిక్కి సూసిడిస.

''నిజమే గద కందారప్పా! అన్ని వూర్లులోన పదేండ్లుగాని లేని పిల్లొల్ని బసివిరాలుని ఇడుస్తుంటే మనూర్లో మా౹్రుము యేంటికి ఇడుసుగూడుదు సెప్పు. మీ మాదిగొళ్లుకి యంత సెప్పినా అర్తుముగాదు. కొమ్ము నరసప్ప బిడ్డ పులిగమ్ముని బసివిరాలుని ఇడిసి నప్పుడు ఇదే రంకు. మస్తానమ్మ బిడ్డ అనుమక్కని బసివిరా ల్నుని ఇడిసినప్పుడు ఇదే రంకు. యాటకని మిమ్ముల్ని వొరుసుకునేది సెప్పండప్పా,'' అనిడిస రెడ్డి.

''అదిగాదు రొడ్డీ, బూము బు౹్రు లేనొళ్లము. యాదో మీకింద కూలీనాలీ సేసుకోని బతికే వొళ్లము. మామింద అట్లా కోపు అయితే యట్టద్యావురా. మీరే యట్లన్నా దయిదలసండ,''ని కీసన్న తాత మట్టసనంగా మాట్లాడిడిస.

''నువ్వు సెప్పు కందారప్పా. అస్సులు నీ బాదేందో అందురు ముందు ఇప్పిసెప్పిడి,'' అని పెదిరెడ్డి అ౹్రే సిడిస.

''సరే రొడ్డీ, మీరు సెప్పితే కాదంటానా. కాదని మేము ఈవూర్లో బూడిదేసేమ్మా. పెట్నామీరే కొట్నామీరే. మీ మాటపకారమే నా బిడ్డి బసివిరాల్ని ఇడిస్తాను,'' అంటాని వొప్పేసుకునిడిస నడిమింటి కందారప్ప.

''అదిసరేప్పా, మడి ద్యావుర్ని సేసేకి ఇబ్బందులు గిబ్బందులు వుండావంటివి. కీసన్నగూడ అదే మాట్ని సెప్పిడిస. ఆ సంగితి కూడ ఇపిడే కడా తెంపులు సేసు కుంటే కార్యుము సేసేకి కర్నుము సామి మూర్తుము కడుతాడు మడి. కర్నుముసామి గూడ యాయాల్నుంచి కదులుకుండ యేంటికి కుసునేద అనుకునేర.''

''కార్యుము అంటే మీకి తెలీంది యేముంది రొడ్డీ. కర్చు కందాయిము వుంటాది కదా,'' అని కందారప్ప.

''మడి అదేనప్పా, నిన్ని సెప్మనింది. యంత కొర్చు అయితాది సెప్పితే వూర్లో వొళ్లు అంతా కలిసి తాల కింత ఇచ్చిడిస్తారు. 'వొండుకొని తినిందానికి వొగిటే రకు మంట. అడుక్కోని తినిందానికి అరవయ్యి ఆరు వంట కాలంట,' అంటాని వూరికే అనేర్నా పెద్దొళ్లు... అడు గడుగు నీ కర్చుయంతో,'' అంటాని వొగ శ్యా౹్తుము యేసి సెప్పిడిస పెదిరెడ్డి.

''అదిగాదు రొడ్డీ. వూరంతమంది ఇచ్చేది వొగెత్తు. మనూరి పెదరొడ్డొళ్లు ఇచ్చేది వొగెత్తు అంటాని మాప్య ద్దొళ్లు యప్పట్నుంచో కతలు సెప్పుతుంటే ఇంటుం డాము. మా ఆసంతా మీమిందే కద రొడ్డీ. మడి మీ మాటేంటో సెప్పనే లేదు,'' అంటాని అడ్డుము తగిలి మాట్లాడిడిస గుంపులో నుంచి లాలప్ప తాత.

''మీ పెద్దోళ్లు సెప్పితే ఇనేమంటావే. నువ్వు సూల్లేద. ఈ వూర్లోనే కాదు ఈ ఆలూరు తాలూకాలోనే నేమికంటి పెదరొడ్డోళ్లంటే సానా మంచోళ్లని పేరు తెచ్చుకునేమ కదా. మేము ఇనాము ఈకుండా ఈ వూర్లో యేవుడన్నా కార్యము సేసుకునేడ్నా యేమి. సెప్ప లాలప్పా... సెప్పు. అందుకనే కదా కందారప్పని కర్సుంతో సెప్మని పదిమంది ముందే అడుగుతుండాను,'' అనిడిస పెదిరొడ్డి.

''వొలేయ్ కందారుగా... నీకేమన్నా మతి పొయ్యే ద్నెమిలేయ్. పెదిరొడ్డి పెద్ద నోటికేసుకోని అడుగులే ఇస్తానంటుంటే, అక్కడా ఇక్కడా సూసుకుంటా నెంగి సిల్లిలక్క నెత్తి గీక్కుంటుండావే. అందికే అంటారు మడి 'మాదిగోనికి మల్లిపువ్వు ఇస్తే మడిసి గుద్దలో పెట్టుకునే న్నంట,' అంటారు పెద్దోళ్లు. వొలేయ్... రా... రాౕరా... ఇట్లుౕరా...'' అంటాని నడిమింటాయప్పని గుంపులోకి పిలిసి గుసుగుసుమని సానా సానా ఇసయాలు సెప్ప తుండారు.

మాదిగోళ్లుకి రొవుంత ముందు మాలోళ్లు గుంపు కుసునేద. వాళ్లుకేమి పట్టినట్లులేదు. వూరికే సూసు కుంట కూసునేర. అవుతులు పక్క బాయెళ్లు గుంపు వుండాది. నబీసావొళ్లు వోట్లుపక్క తురుకొళ్లు గుంపు కుసునేర. వాళ్లకి యడమ పక్క కటికెవొళ్లు, దూదేకు లొళ్లు కుసునేర. రేడీరూము కాంపొండుని ఆనుకొని వున్నిన మంగుళ్లు సాపులు యనకపక్క మంగులొళ్లు అంతా కుసునేర. మంగులొళ్లుకి యెనికిపక్క సాకు లొళ్లు కుసునేర. రొడ్డొళ్లు సరిగ్గ పింజిరొళ్లు, బలిజే వొళ్లు, బైనేవొళ్లు, ఈడిగొళ్లు, క్యామిటోళ్లు, కమ్మొళ్లు పెద్దమనుసులు కట్టమింద వుండారు. మిగిలిన కులా లొళ్లు అంతా రేడీ రూము సుట్టూరుగ కుసునేర. అన్ని కులపొళ్లందురు వున్నీన పండ్లన్నీ ఇడిసి పెట్టుకొని మునిమాపునే రేడీరూముతాకి వొచ్చి కూసునేర.

నడిమింటాయప్ప మా పెద్ద మనుసులు సెప్పిన వన్నీ ఇని పైకి లేసి రొడ్డికి సెపుతుండాడు-

''జొన్ను బూకోసుము రెండు మూట్లు జొండ్లు, సామికి యడేసేకి. పెద్ద మనుసులికి సాబూపెట్టేకి వొగు మూట వొరిబీము. ద్యావురు నంజిరిలోకి యచ్చుము, ఆకులు పూజికి, దీపారాజినికి, పెద్ద మనుసులు ఇనాము. తప్పిడి గొట్టేవొళ్లు కర్సు- వాళ్లు తాగే సారాయి కొల్లుకి, పూజార్లు, బసివిరాళ్లుకి ఇచ్చేకి, అదీ ఇదీ కలిసి రెండు వెయ్యిలు అయ్యితాదేమో సూడి రొడ్డీ,'' అనె.

''దుడ్లేమన్నా సెట్లుకు కాస్తాండాయనుకునేవునా యేమిరా కందారుగా! నీ బిడ్డిని బసివిరాలుని ఇడిసేకి రెండు వెయ్యిలు అయితాదా? ఇదే రెండు వెయ్యిలికి కర్నాటుకుములో అయితే పదిమందిని బసివిరాల్లు నిడచ్చు. నీ బిడ్డేమన్నా బూలోకుము రంబనుకునేవునా. అతిలోకుము సుందరమ్మ అనుకునేవునా. ల్యాకుపోతే వూర్లో యెవ్వరు సూన్నట్లు సూపరమ్మ అనుకునే వునా, నువ్వు రెండు వెయ్యిలు రూపాయిలు అనేతలకాలా ఇచ్చేకి. ఇంతుకు ముందు మీ మాదిగొళ్లు పిల్లుల్ని యంతమందిని బసివిరాల్ను ఇల్లేదు. మేము దుడ్లు ఈలేదు. యంతిచ్చేవొళ్లుము... మాకి బుద్ధొచ్చినపు ట్నుంచి బసివిరాలు కర్సు కింద అయిదారు నూర్లు, యెయ్యి రూపాయిలంటే మగా కస్టిము అప్పా! అట్లా దానికి వొగేసారి రొండు యెయ్యిలంటే మమ్మిల్ని యేమన్నా తిక్కనాకొడుకులు అనుకునేవునా,'' అంటాని లేసి అడిగిడిస కమ్మ నారానప్ప.

''మీరు వూరుకోండప్పా. నేనుండాను కదా మాట్లా డేకి. అది కందారప్ప వొగిని మాట కాదు గదప్పా. వాళ్ల మందిగోళ్లంత కలిసి మాట్లాడుకునిందే మనికి సెప్పేడ. అయినా వాళ్లనని యేమి లాబ్కు సెప్పండప్పా. మిండ్లుకు బుట్టిన గోర్మెంటు అనల్లగాని. అమ్ముబోతే అడివయ్యేద కొనుబోతే కొరివయ్యేద. సంచినిండా దుడ్లు కండానిపోతే సంతులోకి, సారుట్లోకి గూడ రావు సొరుకులు. బసివిరాలు కర్సు కిందికిచ్చే రెండు యెయ్యిలికి లేనిపోని మాట్లన్నీ అని యేం లాబ్కు. సూడండప్పా మన వూరి కట్టిడి పకారుము మాదిగి కందారప్ప తన బిడ్నిని బసివిరాలు ఇడిసేకి సొంతోసంగ వొప్పుకునేడ. ఈ కార్యముకు అయ్యే కర్సులో సాగు బాగుము నేనొకున్నే బరించుకుంటాను. మిగిలింది వూరందురు కలిసి ఇయ్యిండి. ఇంటికి రూపాయి యేసుకున్నా ఇట్లా కార్యలు పడి సెయ్యచ్చప్పా. దీని కింత రాద్ధాంతుము యేంటికిగ్గాని... కందారప్పా ఇంగ పొయ్యి కర్నుముసామి సెప్పినట్లు మలుకులు పున్నుముకు నీ బిడ్డ పెద్దమనిషి అయితాది కదా. అందు కని ఆరెద్దులు కార్తి అయిన మూడు దినాలుకి నీ బిడ్నిని బసివిరాల్ని ఇడిసిడి. యేమండప్పా వూరందరికి ఇది సమ్ముతమే కదా,'' అని పెదిరొడ్డి పంచాద తెంపేతల కాల యెవురింటికి వాళ్లు యెగురుకుంట పొయ్యి డిసిరి.

ఆ పొద్దు రేడీ రూముకాడ జరిగిన పంచాద పొద్దు నుంచి ఈ పొద్దు బోడెక్కని బసివిరాల్ని ఇడిసే వొరుకు

నెలదినాలు వూరువూరంతటికి పండుగున్నట్లే వుండాది. కాకుపోతే సద్దుసంగిట్లోకి జారిపొయ్యిన జొన్నగింజి లక్క బోడెక్క వొగితి ఆ పొద్దుట్నుంచి ఈ పొద్దువొరుకు వొగిటే తరాగా యేడుస్తుండాది.

నీళ్లు లేని బాయిలో బోడెక్కకి గంగుసానుమని ఇంటి కాటి నుంచి కడుపులో యెత్తుకొచ్చిన నీళ్లు నెత్తి మింద పోసిడిసిరి. పాత బసివిరాళ్లంత కలిసి బోడెక్కికి ఇంటికాట్నుంచి కట్టిచ్చుకొచ్చిన తెల్లిసీర తెల్లిరెయికి ఇప్పిదీసి, ముందుగాలుగునే కట్టిపెట్టిన యాపాకు మండులతో పయ్యంత సుట్టిడిసిరి. వొంటి మింద బట్టల్యాకుండ యాపాకు మండ్లుతోనే కాళ్లు కాడ్నుంచి గొంతు కాటి వొరుకు యాపాకుతో పెయ్యి కనపడ కుండ మట్టిడిసేర. ఇదేదో అదిముకాలుములో మనుసులు ఇట్లుండే వొళ్లంటాని బాయిగడ్డ మింద వుండే ముసులొల్లు అనుకుంటుండారు.

బోడెక్క వొగిటే తరాగా యెక్కుళ్లు బట్టేతట్ల యేడస్తుండాది. "వూరుకోమ్మే... వూరుకుండు. 'అమ్మ' కార్యుమప్పుడు యేడుకూడుదు. పులిగమ్మవ్వకి క్యాప్మొస్తే జీవితాంతుము ఇట్లే యేడుసుకుంట బతుకు మని సాప్మ పెడతాదంట. మట్టసనంగా బసివిరాలు అయినోళ్లని పచ్చనాకులక్క సల్లుగ బతుకుమని వరుము ఇస్తాదంట. యేడద్దులేమ్మే. యేడొద్దు. ఇంగ అయిపొయ్యిడిసేద కదా," అంటాని వొగ ముసిలి బసివిరాలు సముదాయిస్తుండాది.

పయినిండ యాపాకులుతో కట్టింటే సేతుల్నీ కాళ్లు కదిలిచ్చేకి కస్టంగా వున్నట్లుండాది బోడెక్కికి. ఇపుడు బసివిరాళ్లు యేమి సేసినా సేతులు అడ్డుము పెట్టేకిల్యాక పాయ. బసివిరాలు అనుమక్క డ్యాగురు లోని బుక్కు పిండి తీసుకొని బోడెక్క ముకుము నిండ బూసిడిసేద. బసివిరాలు వుసేనక్క కుంకుము బొట్టు పెట్టేద. ఇంగోగాయమ్మ యగ్గట్టిన కొప్పుని ఇప్పిదీసి యెంటుకుల్లు ఇరుబోసేద. యడముకాలు అరికాలికి అరిసేతికి మసిబొట్టు పెట్టిడిసేర. కాళుకి సేతులుకి పొసుపు పూసింటే పూలు పూసిన గూర్నాలు సేన్లక్క వుండాది బోడెక్క. జిట్ట తగులుతాదని మసిబొట్టు పెట్టేర.

"అక్కుల్ జోన్... జోక్కుల్ జోన్... జోగో జోగో," అంటాని మూడుసార్లు 'జోగులుతట్ట' పట్టుకుని బసివి రాళ్లు అందురు జోగేసిడిసిరి. బోడెక్కతుక్కు తిరిగి మూడుసార్లు, పడుముటు తిక్కు మూడుసార్లు, తూర్పు తిక్కు మూడుసార్లు తిరిగి మొత్తుము తొమ్మిదిసార్లు జోగేసి... "ఉదోవ్ ఉదో... ఉదోవ్ ఉదో..." అంటాని జోగులుతట్లు యడమ బుజుమింద పెట్టుకుని కుడి సేత్తో యాపాకు మండ్లు పట్టుకుని బసివిరాళ్లు అందురు క్యాకులేసిడిసేతలకాల బయినే ఆయప్ప జమిడికి బుజానికి తగిలిచ్చుకుని, "జుమ్ చుక్‌నక్... జుమ్‌జుమ్ చుక్‌నక్... జుమ్ జుముచుక్‌నక్," అంటాని వాయించ.

బుడ్డుమారప్ప టంకాయి తీసుకుని పైకెత్తి బాయిగడ్డ మెటికులు మింద యేసి కొట్టే తలకాల పిచ్చులు పిచ్చులు అయ్యిడిసేద. ఆ కొబ్బరి ముక్కులు యేరుకునేకి పిల్లొళ్లు తండ్లాడుతుంటే తప్పిట్లోళ్లు, "కణకణ జగ్గణ కణకణ... జగ్గణ కణకణ... జగ్గణ కణ కణ," అంటాని వూపు అందుకునిడిసిరి. యాడదం టాడే కుసినీనవాళ్లూ, నిలబడివోళ్లు, బాయితాకి పురి కొచ్చిడిసిరి. బాయిలో నుంచి ఆడొళ్లందురు గుంపుగా నిలబడి బోడెక్కని మద్దిలోకి యేసుకోని మెల్లిమెల్లిగ మెటికులు యెక్కిచ్చుకుంట పెయికి తీసుకొని వొచ్చేర.

బంగారప్పొళ్లు ఇంటి ముందు బసిరి మాను కింద కట్టేసిన ద్యావురుపోతుని తాళ్లు ఇప్పి సుమారు నూరుమంది బలుమయిన మొగొళ్లు ఇగ్గి పట్టుకునేర. దున్నపోతుని యక్కడ కదులునీకుండ ముక్కలో నులుక్కి రెండు తాళ్లు కట్టేర. కొమ్ములికి రెండు తాళ్లు కట్టేర. నాలుగు కాళ్లకి నాలుగు తాళ్లు కట్టేర. గొంతుకి రెండు తాళ్లు కట్టేర. మ్యల్లో నుంచి ముందురు కాళ్లు మద్దిలోకి గుదిగి కట్టి కట్టేర. నూరుమంది మొగొళ్లు పెయినే ఇగ్గిగ్గి పట్టుకుంటుంటే దున్నపోతు బుసులు కొట్టుకుంట అక్కడా ఇక్కడా సిమ్ముట్లాడు తాండాది.

ద్యావురుకి మూడు దినాలు ముందు పోతుని పట్టుకుని కట్టేసి ముక్కు కుట్టి ముగుతాడు యేసేర. రేవు ద్యావురనంగా తిరిగి ద్యావరుపోతును కాళ్లు గట్టి కిందికేసి బండిగుటాలు, బానేకట్లు, అనుసుకట్లు తీసు కుని తిరిగిన తుక్కల్లా కొట్టి కడువులుతో సన్నీళ్లు యెత్తేర. అయిదేండ్లు అడ్డుముల్యాకుండ రాజ్జిమేలే వొళ్లు మేసినట్లు మేసి బూంమింద కాలు పొందుబెట్టు కోకుండ సిమ్ముట్లాడుకంట తిరిగిన పోతును కట్టేసి కొట్టిండే కొట్టుడానికి పెయ్యి లోపల యముకులు నంజిరి. ముద్దుముద్దు అయ్యిపొయ్యింటాది. దాని నంజిరిని కురాకు వొండుకొని తినినా రుసి వుండుదు. అట్ల అణగొట్టింటే అది ఇంగా యక్కడబడితే అక్కడ సిమ్ముకొని పొయ్యేకి సూస్తుండాది. పొయిము మొగొ ళ్లంతా తాళ్లు ఇగ్గిపట్టి నిలేస్తుండారు.

ద్యావురుపోతు నంజిరి కాపుదనుమొళ్లు తిండ్రు గదా. వూర్లో నంజిరి తినే వొళ్లందరికి కలిసి రెండు మ్యాకుపోతుల్ని ద్యావురికి ఇడిసేర. ఇంగా రొంతు మంది కోళ్లని ద్యావురికి ఇడిసేర.

ద్యావురికి ఇడిసిన మ్యాకుపోతుల్ని నాకారు పిల్లొల్లు తాళ్లతో పట్టుకుని అవిటికి యాపాకు తిని పిచ్చకంట యెగురుకుంట వొస్తుండారు. మ్యాకు పోతులు యనక తప్పిట్లొళ్లు గూడ ఆడేవొళ్లు సరింగ యెగురుకంట తప్పిడి కొడుతుండారు. తప్పిడి రంగన్న అయితే రూపాయి బిల్లులు తప్పిట్లోకి యేపిచ్చుకుని కింది నుంచి సిటుకులు కొడితే తప్పిట్లో దుడ్లన్ని పెయి కెగిరి కింద పడుతుండాయి. కింద పడిన దుడ్లని యేరు కొని యేరుక్కొని జోబులోకి యేసుకుంటుండాడు. అది సూసి తత్తారి గుడ్డాయప్ప రెచ్చిపొయ్యి రూపాయి నోటుని మొంట్లో పడేపిచ్చి తాసే కొట్టకంట, ఆపుకో కుండ కంటిరెప్పలుతో రూపాయినోటుని పట్టుకుని పెయ్యికి లేసిడిసేడ. తప్పిటి రంగన్నకి రోసుమొచ్చి పావులా బిల్లులు న్యాలుమిందేసి తప్పిడి కొట్టుకంట, ఆపుకోకుండ తలకాయి బార్లేసి పొండుకొని ముగు ముని మొంట్లో అట్లా ఇట్లా పొర్లాడిచ్చి పావులా బిళ్లని పణమింద అంటిచ్చుకుని పెయ్యికి లేసి తప్పిట్ని యెగి రెగిరి కొడుతుంటే సుట్టుముట్టు సూసేకి ముసురు కునిన జనుము ఈలులు యేసి క్యాకులు యేసి అరుసుకంట యెగురుతుండారు.

తప్పిట్లొళ్లకి యెనకాలే దాసిరి లసమక్క గలు స్తంబుము పట్టుకుని గంట కొట్టుకంట, దీపారాజ్ఞిము వొత్తిని యెగేసుకంట వొస్తుండాది. ఆయమ్మ యను కునే బైనే ఆయప్ప జమిడికి వాయిస్తుండారు. ఆయప్ప యనకాల్నే జోగులుతట్లు పట్టుకొని జోగేసుకుంట, 'ఉదో ఉదో' అంటాని బసివిరాళ్లు యనక దుబ్బీరక్క కలుసుము పట్టేద. కడాకి ఆడొళ్లంత గుంపు గుంపు నడుసుకుంట మద్దిలో బోడెక్కని నడిపిచ్చుకుంట వొస్తుండారు.

బోడెక్కని సూసేకి యక్కుడక్కుడొళ్లు యగు బడుతాండారు. గుంపులో వుండే బోడెక్క సరింగ కనబడుదు. దూరుము నుంచి సూసేవొళ్లకి బోడెక్క ఇరుబోసుకునిన నెత్తి, బండారు పూసుకునిన మగుము రొంతురొంత కనబడతాండాది. మద్దిలో మద్దిలో ఆడొళ్లు అట్లా ఇట్లా కదిలినపుడు పయ్యంత బట్లు ల్యాకుండ సుట్టిన యాపాకు కనబడతాంది. తేరు పరిసట్లా జనుము కండ్లు కొట్టుకోకుండ బోడెక్కని సూసేకి తండ్లాడుతాండారు. వొగిటేతరాగ బోడెక్క యేడిసీ యేడిసీ కండ్లు యఱ్ఱగ సింతుపిచ్చుకలు అయ్యేవ. కన్నీళ్లు తూడుసుకునేకి బోడెక్క తలకాయి వొంచుకున్నపుడు ఆ గుంపులో నుంచి యేమేమి కను పడుదు.

వూరేగింపు బాయిగడ్డతా నుంచి ఈడిగిరంగ య్యొళ్లు కల్లుప్యంటుతాకి వొచ్చేతలకల్ల, గోయిందు రొడ్డొళ్లు మిద్దిమింద వూర్లో జనుము సేరేర. బోడెక్కని సూసేకి వొచ్చిన వూర్లో ఆడొళ్లంతా గోయిందు రొడ్డొళ్లు ఇంటిమింద, బడేసావొళ్లు మిద్దిమింద, ఇంగా తురుకొళ్లు బాయెళ్లు, వొడ్డేవొళ్లు మిద్దులుమింద నగ్గా జనుము నిలబడిడిసేర.

యేమి సిపారస్తమయిన జనుము కలిసేర్రా! ఇట్లా జనుము పెద్దరొడ్డొళ్లు పెండ్లికి కూడ కలిసండ్రు సూడండప్పా! సూసేనుగాని, యంతుమందునో బసివి రాళ్లని ఇడిసేది. బోడెక్క అద్రుస్టమే అద్రుస్టము అంటాని మంది అంతా అనుకుంటుండారు.

వూరేగింపు సవురమ్మ గుడి తాకి సేరేద. మా వూర్లో వులిగెమ్మవ్వ గుడి లేదు.అంద్కనే సవురమ్మవ్వ గుడిలోనే బొగుమూలుకి జొండ్లు పోసి, జొండ్లు మింద మరువుపెట్టి మరువు మింద ముంతపెట్టి, ముంతు మీద పీసుతీసి ట్యంకాయిపెట్టి దానికి మూడు బండారుతో అడ్డుబొట్లు పెట్టి, దానిమింద పూలుదండ యేసి దేవుతిని సేస్తారు. దానికే కొత్తబట్లు సుట్టి, బట్లు కట్టిచ్చేమ అంటారు. సాతనైనొళ్లు యెండితో మీసాలు, కండ్లు సేపిస్తే ఇంగా కలిగినొళ్లు ముగుమే సేపిచ్చికొచ్చి కార్యుము సేస్తారు. ఈ పొద్దు బోడెక్కని బసివిరాలుని ఇడిసేకి అట్లే సేస్తూండారు.

సల్లునీళ్లు కడుపు తీసుకొనొచ్చి పాదాలకట్ట కడిగి డిసిరి. బండారు పూసి కుంకుము సల్లి నిమ్మకాయిలు వుల్లిగడ్లు కోసి గంధ్రాగొడ్లి, యాటకొడివెండ్లుకి పూజ్జేసి ట్యంకాయి కొట్టిడిసిరి. పోతుని, బోడెక్కని గుడి సుట్టు మూడుసార్లు తిప్పుకొని వొచ్చి గుడికి ముందుగాల పాదాలు కట్ట కాడ నిలిబెట్టిడిసిరి. ఆడొళ్లని పిల్లొల్లని దూరుము జరిపిడిసిరి. "కొత్త వూర్లొళ్లని ఈడ్యాడ వుండొద్దండప్పా. మడసనంగా సెపుతుండాము దూరుము పొండి. యేమండప్పా ఇది పెద్ద మనుసులు మాట. యేరే వూరొళ్లు పాలికండాని పొయ్యేకి వొచ్చిం టారు. వుండూరొళ్లంతా పెయినింద కండ్లు బెట్టుకొని ఆయుదాలు పట్టుకొని వుండండ,"ని లాలప్ప తాత క్యాకేసిడిస.

పదేండ్లు దాటిన పిల్లోల్లు నుంచి ముసిలిముసిలొల్లు వరుకు మొగొళ్లంతా, కట్లు, కటార్లు, బల్యాలు, బాకులు, పిడికత్తులు, యాటకొడివెండ్లు, గండ్రాగొడ్డేండ్లు, అనుసుకట్లు, పురిబల్యాలు, బానేకట్లు, బండిగూటాలు పాదాలు కట్టకాడ పెట్టి పూజ్జేసినవన్నీ తలాకొకిటి మా మాదిగోల్లంతా తీసుకునిడిసేర. పెండ్లయిన మొగొళ్లు పెండ్లాల తాలిబొట్టుని కుడిసేతికి కట్టుకునేర. పెండ్లి కానోళ్లు మలతాడు తీసుకుని కట్టుకునేర. ఇట్లా తప్పుడు యేమన్నా అయ్యి పానుము బోతే మోచ్చుము వొస్తాదని నమ్ముకుము. బాయెళ్లు గూడ వొగురో ఇద్దరో వొచ్చి నిలబడేర. ద్యావురుపోతుని నరికినపుడు దాని రొగుతుము యంత దూరుము సిట్లుతాదో అంత దూరుములో కొత్తు వూర్లొళ్లుని వున్నీకుండ దూరుము పొమ్మనేరగదా. ఇంగ మిగిలిన మా వూరొళ్లంత దున్నుపోతుని ఈ యేడు యెవుడు మూడేట్లుకి నరుకుతాడోనని సూసేకి తొక్కులాడుతుండారు.

అయిదారేండ్లు నుంచి అదేపనికి గండ్రాగొడ్లి సేపిచ్చుకుని కొబ్బరి బల్లుము, సెలిమిండి ముద్దులట్లా యచ్చుము తినుకంట అయిదారుమంది వుండారు. పూరుము కాలుములో అయితే వొగిటే యేటికి దున్నపోతుని నరికేవొళ్లు అని మా తాతొళ్లు సెపుతుండారు. డోనుమొద్దు అట్లా దున్నుపోతు మ్యడిని వొగిటేయేటికి తుంట్లు బడేతట్ల యట్ల నుకుతారప్పా అంటాని అచ్చర్యుము పొయ్యేవొళ్లుము. ఇప్పుడు నానాకు మొందులు కూడు తినే ఈ నాయండ్లు సాతనేమయితాది. అట్లాదానికే మూడేట్లుకి కన్నా మూడేట్లుకి నరికినోనికి మూడు తులాలు బంగారుము ఇస్తారు. ఇంత కత వుండాది కనుకే మరి వొగిని మింద వొగుడు పోటీపడి యడీ గండ్రాగొడ్డేండ్లు అదే పనికి సేపిచ్చుకుని పిక్కమింద కండపురి తిరిగేతట్లా యచ్చుము తిని బలుస్తారు. పై పందాలు గూడ నగ్గా కాస్తారు.

ఈ యేడు ద్యావురుపోతుని నరికే వొంతు తలారి నాగన్న కొడుకు రామిగిరికి వొచ్చేద. తోడు పెండ్లికొడుకు లక్క వొగురు నరుకు ల్యాకపోతే కార్యుము ఆగిపొయ్యి అపుచారుము అయితాడని మిగిలిన అయిదారు మందిని నరికేకి వుండల్లని పెద్ద మనుషులు వొప్పందమంట. అందక్కని రామగిరి సరిగ్గ, దుబ్బిరన్న కొడుకు ముక్కిడి రామాంజిని, రోగాయప్ప కొడుకు ఈరుగాడు, సిన్నాయప్ప కొడుకు మల్లికార్జిని, కీసన్న కొడుకు నరసప్ప, యెదిరింటి కందారప్ప కొడుకు ఇసువురప్ప, గోనులు పోసుకుని అంగీలు వుప్పేసి రెక్కిలికి తాయెత్తులు కట్టుకుని, కుడిసేతి కంకణానికి పెండ్లాలు తాలిబొట్టు కట్టుకుని, మీసాలు పురిపెట్టి తొడగొట్టి ఆయుదాలికి మొక్కి గండ్రాగొడ్డేండ్లు తీసుకొనేర.

దున్నుపోతు ముందు కాళ్లు కింది నుంచి కాడేమాను యేసి గొంతుని కాడేమాను మింద పెట్టి యక్కుడొళ్లు అక్కడ బిగబట్టేర. యెనకిపక్కి కూడ దున్నుపోతుని కదిల్నీకుండ కడుపు కిందికి అవుతులు నించి, ఇవుతులు నించి, కాడేమాండ్లు యేసి ఇరుగు బట్టుకునేర.

రామిగిరి వొచ్చి ద్యావురుపోతు మ్యడకాడ నిలబడి రెండు సేతులుతో గండ్రాగొడ్డిని పైకెత్తి ద్యావురుపోతు మ్యడమింద మెల్లిగ ఆనిచ్చి పైకెత్తి, అట్ల రెండుసార్లు సామిని మొక్కినట్లు సాంపులు సూసినట్లు సేసి వొగుసారి నిక్కినీలిగి గండ్రాగొడ్లుని బలుముకొద్ది రెండు సేతులుతో పైకెత్తి వాటుము సూసి అడ్డుము బెట్టి వొగిటే యేటు నరికితే సరి, దెబ్బకి దున్నుపోతు తలకాయి తెగి తుండు బడిడిస. దున్నుపోతు తలకాయి కాడిమాను మిందు నుంచి యాలడపడే తలకాల గొంతు కింద యేలంత కరుసుకునీన తోలుగూడ తెగి పొయ్యిడిసేద. తప్పిట్లు జమిడికులు, బసివిరాళ్ల 'ఉదో ఉదో' అరుపులు మద్దిలో వొగిటే క్యాకులు ఈలులు యేసుకుంట రామిగిరిని పెయికెత్తి పూలు దండ్లు యేసి యెగురేస్తుండారు అరుసుకుంట.

మూర్తుము దాటిపోతాది పదండప్పా పదండని బోడెక్కిని గుళ్లోకి తీసుకునిపొయ్యి పూజ్జేసి జోగుళ్లు యేసి 'ఉదో ఉదో' అనిడిసిరి. పయ్యంత సుట్టిన యాపాకుమండ్లు ఇప్పి అదరాబాదరా పసుపుపచ్చ సీర, రెయికి తొడిగిచ్చి, ద్యావరుకట్ట ముందు నిలిబెట్టిచ్చి కర్నుము సామితో కాలుతొక్కిచ్చి బయినే రామన్నతో దావర్లు కట్టిపిచ్చిడిసిరి.

అయిపొయ, నడిమింటి బోడెక్క బసివిరాలు అయ్యేద. ఈ పొద్దుట్నుంచి నడిమింటి బోడెక్కిని యెవుని సాతనైతే వాడు పెట్టుకోవొచ్చు. సిత్తకార్తిలో ఆడుకుక్కు సుట్టు అరువయ్యి ఆరు మొగుకుక్కులు సేరినట్ల, యట్లాగో వొగట్ల యేసుకోవల్లని సూస్తాయో ఇంగట్లా, బోడెక్కికి కన్నిరికుము పెట్టి సాతనైనన్నాల్లు పెట్టుకునేకి వూర్లో వొళ్లంత కాపులు కాస్తుంటారు.

సిత్తకార్తిలో అరవయ్యి ఆరు మొగుకుక్కులు సొంగు కారుసుకుంట ఆడుకుక్క తాకివొచ్చేకి సూసినా సాతనైన వొగిటే వొగు మొగుకుక్క యెక్కి పిట్లేసుకున్నట్ల వొయిసు అయిపొయ్యే వొరుకు ఇంగోర్ని దరికి రానీ

కుండ బసివిరాలుని వొలుసుకుని తినేకి యక్కడ దప్పిన్నాయాండ్లు అందురు యెదురు సూస్తుండారని మాయమ్మ ఇంగా యేమేమొ సెప్పుతుంటే...

“బోడెక్క ఇంగా పెద్దమనిషి కూడా అయిలేదు కదమ్మా. ఈ పొద్దు బసివిరాలుని ఇడిసేర కదా. ఆ ద్యావుర్లు గట్టిన పూజారాయప్ప, కాలుదొక్కిన కర్నుము సామి, కుంకునుము గట్టిన గొరువయ్య- ముగ్గురు ముసలి నాబట్లు కలిసి, సామి కార్యుమని ఆ పిల్లిని ఈ రాతిరికే వొగుడయినంక వొగుడు పక్కులో పొండు బెట్టుకుంటారంట. అన్నిము పున్నిము యెరుగుని నడి మింటి బోడెక్కిని బసివిరాల్ని సేసి బజారికి యేసిడిసిరి. పెద్దమనిషి అయ్యేతలకాలే యంతమంది ముట్టు కుంటారో, పాయిము అయిపొయ్యేతలకాల యంత మంది పిల్లుల్ని పుట్టిస్తారో, ముసిలిముప్పుతనానికి ఆ బగుమంతునికే తెలల్ల తల్లోయ్... తలుసుకుంటేనే బయమయితాది,” అంటానీ దీర్గలు తీసిడిస గుంత కంటి మస్తానమ్మ పెద్దమ్మ.

ద్యావురపోతుని పగులుగోసి తోలు ఇడిపిచ్చి నంజిరి కుప్పులు యేస్తుండారు. ఇంటికొకిటి లక్క కుప్పులేసేర. మేము పెద్దింటి మాదిగొళ్లుము. మాకి మేలేటు ఇయ్యుల్ల. మా నాయిన సానా పగులు మొగోడు కదా. అట్లా తాకిరాడు. మా పెద్దప్పుకేమొ యంతుసేపు సేన్లు సేన్లు అంటారని సేన్లోపడి సేన్లోనే సచ్చిపోతుండాడు. మా ఇంటికి నేనే పెద్దకొడుకుని. సిమింతున్నా ఈడు సిట్లు పడతాడని మాయమ్మ నాకి బిరుదు ఇచ్చేద.

త్యామ్మే త్యారాదా! గుడి కట్టకాడ ద్యాపురనంజిరి కుప్పులేసేది అయిపాయ. నీకి డ్యాగురు కడిగేదే కాలేదు. యట్లాగో అట్లాగ వుంటే వున్నీ త్యామ్మే అంటని డ్యాగురు తీసుకుని గుడితాకి పొయ్యి ద్యావురు పోతు నంజిరిలో మా పెద్దింటి కుప్ప యెత్తిచ్చుకుని నెత్తిమింద పెట్టుకుని ఇంటికి వొస్తుంటే పెయిన కాకులు, గద్దులు, నడిమింటి బోడెక్కిని వూర్లో వొళ్లు తన్నుకుపొయ్యినట్లు నంజిరి కండ్లుని తన్నుకు పొయ్యేకి గంగురాటుము తిరిగినట్లు తిరుగుతుండాయి.

నేనేమన్నా సిన్న మొగోన్ని అనుకునేర్నా. నెత్తి మింద నంజిరిడ్యాగిరి పెట్టుకుని యడమసేత్తో డ్యాగురు పట్టుకుని కుడిసేతులోని సిల్లాకట్టితో సాము కట్టి తిప్పుకంట కాకులు గద్దుల్ని నంజిరికండ్లుని తన్నుకు పోనీకుండా ఇల్లు సేరిడిసేన.

*‘మాదిగోడు’ కథల సంపుటి, నవంబర్ 1997*